# పోలింగ్‌కు సర్వం సిద్ధం

■ పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది ■ దుబ్బాక నియోజకవర్గంలో 1,98,100 మంది ఓటర్లు ■ సమస్యాత్మక కేంద్రాల వద్ద పోలీసు బలగాలు

దుబ్బాక, నవంబర్ 29: శాసనసభ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. దుబ్బాక నియోజకవర్గంలో ప్రశాంతంగా పోలింగ్ జరిగేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. బుధవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట మోడల్‌స్కూల్‌లో పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ ఏర్పాట్లు జరిగాయి. ఈవీఎం, బ్యాలేట్ యూనిట్, వీవీప్యాట్‌లతో సిబ్బందిని బస్‌లలో పోలింగ్ కేంద్రాలకు తరలించారు. పోలీసు బందోబస్తుతో సిబ్బందిని, ఎన్నికల సామగ్రిని తరలించారు. నేడు (గురువారం) ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ జరుగనుంది. ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. ప్రశాంత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. దుబ్బాక నియోజకవర్గంలో మొత్తం 1,98,100 మంది ఓటర్లున్నారు. ఇందులో 1,01,081 మంది మహిళలు, 97,019 మంది పురుషులున్నారు. మొత్తం 253 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టణంలో సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాల వద్ద భారీగా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.

### 1200కు పైగా పోలింగ్ సిబ్బంది

దుబ్బాక నియోజకవర్గంలో 253 పోలింగ్ కేంద్రాలకు 27 రూట్లు, 110 బస్‌లు, 27 మంది సెక్టోరియల్ అధికారులు, 253 మంది పోలింగ్ అధికారులు(పీవో), 253 మంది ఎపీవో(అసిస్టెంట్ పోలింగ్ అధికారులు), మరో 516 మంది ఓపీవోలతో పాటు మరో 20 శాతం అధనపు సిబ్బందిని నియమించినట్లు దుబ్బాక రిటర్నింగ్ అధికారి గరిమా అగర్వాల్ తెలిపారు. వందమంది మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. లచ్చపేట మోడల్ స్కూల్ నుంచి బుధవారం మధ్యాహ్నం రిటర్నింగ్ అధికారి గరీమా అగర్వాల్ నేతృత్వంలో పోలింగ్ కేంద్రాల అధికారులు, సిబ్బందికి పోలింగ్ సామగ్రి అందజేసి రూట్‌ల వారీగా పోలింగ్ కేంద్రాలకు తరలించారు. పోలింగ్ సంబంధించిన యంత్రాలు(ఈవీఎం, వీవీ ప్యాట్), సిబ్బంది తరలింపును ఆర్వో గరిమా అగర్వాల్‌తో కలిసి ఎన్నికల పరిశీలకుడు మన్మోహన్ ప్రసాద్ పరిశీలించారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి పీఎస్ కంట్రోల్ యూనిట్–1, బ్యాలేట్ యూనిట్–2, వీవీ ప్యాట్–1 చొప్పున పోలింగ్ అధికారులకు అందజేశారు. ఒక పోలింగ్ కేంద్రానికి ఐదుగురుని నియమించారు.



లచ్చపేట మోడల్‌స్కూల్‌లో ఎన్నికల సామగ్రిని సరి చూసుకుంటున్న సిబ్బంది

### భారీగా పోలీసు బలగాలు

నియోజకవర్గంలో ప్రశాంతంగా పోలింగ్ జరిగేందుకు భారీ గా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో మొత్తం 253 పోలింగ్ కేంద్రాలకు 27 రూట్ సెక్టర్లు ఏర్పాటు చేశారు. ఇందులో 51 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్నాయని, అక్కడ బందోబస్తు పెంచినట్లు నియోజకవర్గ పోలీసు నోడల్ అధికారి మల్లారెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో సూమారు 800కు పైగా పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఇందులో ఒక అడిషనల్ డీసీపీ/ఏసీపీ, ముగ్గురు సీఐలు, 10 మంది ఎస్ఐలు, 30 మంది ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లు, 200 మంది పోలిసు కానిస్టేబుళ్లు, 50 మంది మహిళా పోలీసులు, 250 హోంగార్డులు, 154 ఎస్ఎస్‌బీ సిబ్బందిని నియమించారు. ఇందుకు 23 రూట్ మోబైల్స్, 13 స్ట్రక్కింగ్ ఫోర్స్, 3 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ఎడుగురు చొప్పున పోలీసు సిబ్బంది ఉంటారు.

### తొమ్మిది మోడల్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

నియోజకవర్గంలో 253 పోలింగ్ కేంద్రాలుండగా, ఇందులో 9 పోలింగ్ కేంద్రాలను ఆదర్శ పోలింగ్ కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. ఇందులో మహిళా, పీడబ్ల్యూడీ పోలింగ్ కేంద్రాలను సైతం ఏర్పాటు చేశారు. మోడల్ పోలింగ్ కేంద్రాల్లో దుబ్బాక ప్రైమరీ పాఠశాల(పోలింగ్ కేంద్రం నెం.34), మిరుదొడ్డి మండలం అందె ప్రభుత్వ ఉన్నత పాఠశాల(102), దౌల్తాబాద్ మండలం కొనాయిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల(200), అక్బర్‌పేట–భూంపల్లి మండలం పోతారెడ్డిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల(20), తొగుట ప్రభుత్వ ఉన్నత పాఠశాల(129), రాయపోల్ మండలం కొత్తపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల(182), నార్సింగ్ మండలం పోతాన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల (252), నర్సింగ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల(211), చేగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల(226) కేంద్రాలను ఆదర్శ పోలింగ్ కేంద్రాలుగా ఏర్పాటు చేస్తున్నారు. వీటితో పాటు మహిళా మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో దుబ్బాక మున్సిపల్ పరిధిలో చేర్వాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల(56), దుంపలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల(50), మిరుదొడ్డి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల(96), దౌల్తాబాద్ మండలం గాజులపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (146) కేంద్రాలున్నాయి. దుబ్బాక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీడబ్ల్యూడీ పోలింగ్ కేద్రం ఏర్పాటు చేశారు.



దుబ్బాకలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు మన్మోహన్ ప్రసాద్, ఆర్వో గరిమా అగర్వాల్




పోలింగ్ కేంద్రాలకు బస్‌లో వెళ్తున్న సిబ్బంది



పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న పోలీసు బలగాలు



ఎన్నికల సామగ్రితో వెళ్తున్న సిబ్బంది

## భూమిలో ఊట రావద్దా?



తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాదని తెలిసి వాళ్లు ఇష్టమచ్చినట్లు హామీలిచ్చిండ్రు. రైతులను ఆగం చేస్తామంటే ఊరుకునేది లేదు. ఎవుసానికి 3 గంటల కరెంట్ సరిపోతుందని ఆ నాయకులు మాట్లడటం విచిత్రంగా ఉంది. రైతులమంతా 10 హెచ్‌పీ మోటరు పెడితే భూమిలో ఊట ఎట్లా వస్తది. ఎవుసంపై అవగాహన ఉన్నోళ్లు ఇలా మాట్లాడరు. రైతును అమాయకులను చేసి, ఓట్ల కోసం కాంగ్రెస్ నాయకులు నోటికొచ్చినట్లు మాట్లడటం సరికాదు. 3 గంటల కరెంట్, 10 హెచ్‌పీ మోటరుతో ఎవుసం చేయటం వీలుకాదు.

**- కాసర్ల చంద్రం, ఆరేపల్లి, దుబ్బాక**



## కాంగ్రెస్ వస్తే రైతులు సచ్చుడే

ఏండ్ల కొద్దీ సరిగా కరెంట్ ఇయ్యాన్ని కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మళ్లా ఎనుకటి కరెంట్ బాధలు రైతులకు తప్పవు. 10 హెచ్‌పీ మోటర్లు ఎక్కడ ఉన్నాయ్. 5 హెచ్‌పీ, 7 హెచ్‌పీ మోటర్లు రైతులకు యాడ దొరుకుతాయ్. కాంగ్రెస్ నాయకులు ఎప్పుడైనా ఎవుసం చేసిండ్రా. రైతుల కోసం ఆలోచన చేయ్యరా? 10 హెచ్‌పీ మోటర్లు బాయిల కాడ పెడితే నీళ్లు ఎక్కడి నుంచి తేవాలే. కరెంట్ బిల్లు ఎంత వత్తది. బిల్లు ఎవ్వరు కట్టాలే. గింత ఇంకితజ్ఞానం లేకుండా రేవత్‌రెడ్డి మాట్లాడడం మంచిగా లేదు. మూడు గంటల కరెంటు వద్దు.. ఆ కాంగ్రెస్ పాలన వద్దు.

**-మద్దెల మల్లేశం, రైతు, మిరుదొడ్డి**

## కాంగ్రెసోళ్ల ‘భూమాత’ మాకొద్దు



ఉన్న ధరణి తీసేసి అధికారుల కడుపు నింపే భూమాతను కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తెస్తామనుడు మంచిగా లేదు. భూమాత వస్తే ఎనుకటి రోజులు వస్తయ్. కాంగ్రెస్ వస్తే పటేల్, పట్వారీలా దళారీలు దందా ఊర్లల్లో మళ్లా మొదలైతది. తహసీల్దార్ ఆఫీస్‌లో రైతుల భూములు ఒకల పేరు మీది నుంచి ఒరొకరి పేరుమీదికి ఎక్కుతయ్.. ఇప్పుడూ ఉన్న ధరణితో ఎలాంటి ఇబ్బందులు లేవు. రైతుబంధు, రైతు బీమా డబ్బులు వస్తున్నాయి. కాంగ్రెస్ తెస్తానంటున్న భూమాత మా రైతులకు వద్దు.

**- సత్తు రాజిరెడ్డి, రైతు, మిరుదొడ్డి**



## మళ్లీ పాత రోజులొద్దు

మిరుదొడ్డి, నవంబర్ 29: రాత్రి పూట కరెంట్ ఇయ్యడానికే కాంగ్రెసోళ్లు తయారయిండ్రు. మూడు గంటల కరెంటుతో ఏ పంటలు పండుతాయ్. ఆ కరెంట్‌తో కింది వరకు భూమి తడుస్తదా? మా రైతుల బాధలు కాంగ్రెస్ నాయకులకు పట్టవు. 10 హెచ్‌పీ మోటర్ పెట్టి మూడు గంటలపాటు పంపు ఆన్ చేస్తే మత్తుగా నీళ్లు సరిపోతాయని కాంగ్రెస్ అధ్యక్షుడు రేంవత్‌రెడ్డి అనడం రైతులను సంపడానికేనా? ఎవరికైనా తెలుస్తయి రైతుల గోసలు. మా రైతులకు మూడు గంటల కరెంట్ అద్దు. 24 గంటల కరెంట్ మంచిగా ఉన్నది.

**- నంద్యాల అంజిరెడ్డి, రైతు, మిరుదొడ్డి**



## 24 గంటల కరెంట్‌తోనే ఉపాధి

సిద్దిపేటరూరల్, నవంబర్ 29: తెలంగాణ వచ్చాక కరెంట్ పోతలేదు. పదేండ్ల కింద కరెంట్‌పోతే ఎప్పుడత్తదో తెలిసేది కాదు. కరెంట్ ఉంటేనే పని.. లేకుంటే లేదు. బీఆర్ఎస్ పాలనలో కరెంటు 24 గంటలు ఉంటున్నది. రైతులకు సంబంధించిన పనిముట్లు, నాగళ్లు, ట్రాక్టర్లకు సంబంధించిన పనిముట్ల తయారు చేస్తున్న. సిద్దిపేటలో పని చేసి సొంతంగా షాపు ఏర్పాటు చేసుకున్న. కాంగ్రెస్ వాళ్లు అంటున్నట్టు 3,4 గంటల కరెంట్ అయితే సరిపోదు. కేసీఆర్ గవర్నమెంట్‌ల కరెంట్ కష్టాలు తీరినయ్. పుష్కలంగా నీళ్లు వస్తున్నయ్. రైతులు వ్యవసాయం బాగా చేసుకుంటుండ్రు. మాలాంటోళ్లకు ఉపాధి కూడా దొరుకుతున్నది.

**- బోయిని కనకరాజు, వెల్డింగ్ అండ్ ఇంజినీరింగ్ వర్క్స్‌షాపు యజమాని, రాఘవాపూర్, సిద్దిపేట రూరల్ మండలం**